
పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీకుమారి


పెద్దేముల్ : రుక్మాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఈవో బాలకోటేశ్వర్ రావు


మర్పల్లి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో నీరజ

# విత్తన జాగ్రత్తలపై రైతులకు అవగాహన

- డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి..
- లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలు కొనొద్దు
- ఎంఆర్‌పీ ధర చూసుకోవాలి
- వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి
- పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రంగా ఉంచాలి

పరిగి, మే 27: రైతులు పత్తి విత్తనాలను సీడ్ లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే కొనుగోలు చేయాలని పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి సూచించారు. సోమవారం పరిగి మున్సిపల్ పరిధిలోని మల్లెమోనిగూడ, కిష్టమొల్లతండా, రంగాపూర్, బసిరెడ్డిపల్లి, రాఘవాపూర్, జాఫర్‌పల్లి, నస్కల్, సుల్తాన్‌పూర్, తొండపల్లి గ్రామాల్లో రైతులతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సుల్తాన్‌పూర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఏడీఏ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పని సరిగా రసీదు పొందాలన్నారు. లైసెన్స్ లేని వారి దగ్గర విత్తనాలు కొనరాదని, వారి వివరాలు వ్యవసాయాధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. విత్తనాలు కొనేముందు తప్పనిసరిగా ఎంఆర్‌పీ ధర చూసుకొని, రసీదుపై సంతకాలు చేయాల్సిందిగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ విస్తరణాధికారులు మహిపాల్, శశాంక్, దివ్య, చంద్రకళ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట :** వానాకాలం సీజన్‌లో పంటలు పండించే రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. మండలంలోని కొత్తూరులో సోమవారం ఆమె రైతులకు విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పక తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్ మరియు బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏవో అనురాధ రైతులకు వివరించారు. నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోరాదని, డీలర్లు కూడా నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈవో రేణుక, రైతులు పాల్గొన్నారు.

**మర్పల్లి:** రైతులు డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రసీదును పంటలు వచ్చే వరకు భద్రపరుచుకోవాలని ఏవో వసంత అన్నారు. సోమవారం మండలంలోని సిరిపురం, బిల్‌కల్, పట్లూర్, మర్పల్లి, కల్‌ఖోడా క్లస్టర్ల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆయా క్లస్టర్ల ఏఈవోలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లూజుగా ఉన్న బస్తాలలో విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయరాదన్నారు. పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు మహేశ్, ప్రశాంత్, నీరజ, స్వాతి, జోత్స్న, రైతులు పాల్గొన్నారు.


బొంరాస్‌పేట:కొత్తూరులో అవగాహన కల్పిస్తున్న ఏవో అనురాధ

**పెద్దేముల్ :** నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి షేక్ నజీరొద్దీన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొట్లపల్లి, గోపాల్‌పూర్, బండమీదిపల్లి, రుక్మాపూర్, ఖానాపూర్, ఇందూరు, జయరాం తండా గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయా క్లస్టర్ల ఏఈవోలు, ఏవో విత్తనాల కొనుగోళ్లకు సంబంధించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు సమయంలో వ్యవసాయ అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించాలన్నారు. తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. ఎవరైనా లూజ్ విత్తనాలు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు బాలకోటేశ్వర్ రావు, రజిత, స్వాతి, శ్రవణ్, శివరత్, పంచాయతీ కార్యదర్శులు రాజు, సుశీల, పరమేశ్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్ : గోపాల్‌పూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏవో షేక్ నజీరొద్దీన్

## అటవీ భూముల సేద్యంపై హక్కులు కల్పించాలి


ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చాకల్‌పల్లి గ్రామ రైతులు

పరిగి, మే 27 : అటవీ భూముల సేద్యం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు యాజమాన్య హక్కులు కల్పించాలని చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గ్రామ రైతులు సోమ వారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అటవీ భూముల సేద్యంపై హక్కులు కల్పించిందని, అందువల్ల ఇప్పటి ప్రభుత్వం రక్షణ కల్పించాలని వారు కోరారు.

## నకిలీ విత్తనాల పట్టివేత..కేసు నమోదు




కొడంగల్, మే 27: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో 9 క్వింటాళ్ల 72 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భరత్ తెలిపారు. గ్రామానికి చెందిన మోయిన ఆశప్ప ఇంట్లో తనిఖీ చేయగా 20 సంచుల్లో మొత్తంగా 9.72 క్వింటాళ్ల పత్తి విత్తనాలు లభించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 16,77,000లు ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆశప్పను విచారించగా..నారాయణపేట జిల్లా సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన హన్మయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం ఉడుపులపాయ గ్రామానికి చెందిన వేణుబాయి ఇద్దరు కలిసి వ్యాపార నిమిత్తం తన ఇంట్లో అద్దెకు గది తీసుకొని నకిలీ విత్తనాలను నిల్వ చేసుకున్నట్లు తెలిపారు. కొడంగల్ మండల వ్యవసాయాధికారి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి నకిలీ విత్తన వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే...



బషీరాబాద్, మే 27 : మద్యం తాగి వాహనాలు నడిపితే , మైనర్లకు వాహనాలు ఇస్తే జైలు తప్పదని బషీరాబాద్ ఎస్సై రమేశ్ కుమార్ హెచ్చరించారు. తాండూరు డీఎస్పీ ఆదేశాల మేరకు మూడు రోజులుగా మండలంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగుతున్నది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని ఎనిమిది వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేసుకో వాలని వాహనదారులకు సూచించారు. ఏదైనా నేరం (ప్రమాదం) జరిగినప్పుడు వాహనానికి నెంబర్ ప్లేట్ లేకుంటే ఆ కేసులో ప్రమాదం జరిగిన వ్యక్తులకు న్యాయం జరగదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ఇచ్చిన వ్యక్తిపై, వాహనం నడిపిన మైనర్‌పై కేసు నమోదు చేస్తామన్నారు



మర్పల్లి, మే 27: ఎస్‌కేఆర్ ట్రస్ట్ ద్వారా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున, గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆ సంస్థ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## దుకాణాల లైసెన్సుల రెన్యూవల్ తప్పనిసరి

వికారాబాద్, మే 27 : మున్సిపల్ పరిధిలోని ఆయా దుకాణాల యజమానులు తమ లైసెన్సులను తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో దాదాపు 1280 దుకాణాలు ఉన్నాయన్నారు. వీటిలో 20శాతం వరకు మాత్రమే దుకాణ యజమానులు లైసెన్సులు రెన్యూవల్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా దుకాణ యజమానులు మున్సిపల్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా ప్రమాదం జరిగితే బీమా వర్తించదన్నారు. రెన్యూవల్‌కు సంబంధించి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చేవెళ్లటౌన్, మే 27 : ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్లలో జరిగింది. చేవెళ్ల ఎస్సై వీర బ్రహ్మచారి తెలిపిన వివరాలు.. మెదక్ జిల్లాలోని టేక్మల్ మండలంలోని మార్గవాని కుంటలోని తండాకు చెందిన రాజు (32) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం చేవెళ్లకు వచ్చి టీచర్స్ కాలనీలో ఉంటున్నాడు. సోమవారం ఉదయం అద్దెకు ఉంటున్న ఇంట్లోని సంపులో నీళ్లు తోడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మోటార్ స్విచ్‌తో కరెంట్ షాక్ తగిలి ఆ సంపులో పడి మృతి చెందాడు. మృతుడికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బస్సు సౌకర్యం కల్పించండి


బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు, చైల్డ్‌లైన్ సిబ్బంది

వికారాబాద్, మే 27 : వికారాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల పాఠశాల విద్యార్థులు సోమవారం కలెక్టరేట్‌లోని 1098 చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది సహకారంతో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ మండల పరిధిలోని పులు మద్ది, ఎర్రవల్లి, సర్పన్‌పల్లి, అత్తెల్లి, మదన్‌పల్లి, పాతూర్, కామారెడ్డిగూడ, బూరాన్‌పల్లి, పులుసు మామిడి, పీరంపల్లి, కోటాల గూడ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కోవిడ్ కంటే ముందు బస్సు సౌకర్యం ఉండేదని, అనంతరం నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే మైలార్ దేవరంపల్లి వరకు అదనపు బస్సు అవసరం ఉందని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టాస్ అధ్యక్షులు జ్యోతి, సానియా, ఎన్‌వీ ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాస్, వెంకటయ్య, ఆశలత, ఉమా, టాస్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదాలు..


షాద్‌నగర్‌టౌన్: ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


బషీరాబాద్: రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

షాద్‌నగర్‌టౌన్, మే 27 : మున్సిపాలిటీలోని సిమ్లానగర్‌కాలనీ వెళ్లే దారిలోని అంతర్గత మురుగు కాలువ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందొనని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన అంతర్గత మురుగు కాలువ మ్యాన్‌హోల్ పైభాగం ధ్వంసం కావడంతో చెత్తా చెదారం అందులో పడి దుర్వాసన వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ ధ్వంసమై రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో దారిలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను గ్రహించకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

**బషీరాబాద్‌లో..**

బషీరాబాద్, మే 27 : బషీరాబాద్-మైల్వార్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు మార్గంలో మంతన్ గౌడ్ గేట్ సమీపంలో గొయ్యి ప్రమాదకరంగా ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తున్నది. ఏ మాత్రం ఆజాగ్రత్తగా ఉన్నా గమ్యం చేరకముందే గొయ్యిలో పడి పోవడం ఖాయం. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే గుంతలో పడిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై గొయ్యి ఏర్పడింది. పైన రోడ్డు ఉన్నట్లు కనిపిస్తుంది కానీ కింద భాగంలో గొయ్యి ఏర్ప డింది. ప్రమాదం జరగక ముందే గొయ్యిని పూడ్చివేయాలని ప్రయాణికులు, వాహన దారులు కోరుతున్నారు. అయి తే వాహన దారులు గొయ్యి వద్ద ముళ్ల కంపను ఏర్పాటు చేశారు.

## నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి


రాంపూర్‌లోని పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న డీపీవో డాక్టర్ జయసుధ

కులకచర్ల, మే 27 : గ్రామ పంచాయతీలో ఉన్న ఆస్తుల సంరక్షణకు కృషిచేయాలని, పల్లె ప్రకృతివనంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని వికారాబాద్ డీపీవో జయసుధ అన్నారు. సోమవారం కులకచర్ల మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో పల్లె ప్రకృతినంతో పాటు, గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ ఆస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వివిధ ఆస్తులను సంరక్షించేందుకు పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది కృషిచేయాలన్నారు. హరితహారం కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని జరిగిందని నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. మొక్కలు ఎండిపోతే పంచాయతీలదే బాధ్యత అని తెలిపారు. రానున్న వర్షాకాలంలో కూడా మొక్కలు నాటేందుకు అన్ని విధాలుగా సిద్ధం చేయాలని అన్నారు. అనంతరం చాపలగూడెం గ్రామంలో ఉన్న నర్సరీ, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఎంపీవో కరీమ్, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పెద్దేముల్, మే 27 : వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై గిరి సూచించారు. సోమవారం మండల పరిధిలోని తట్టేపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు నంబర్ ప్లేటు లేకుండా రోడ్లపై నడిపితే వాటిని సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్లు లేని ఏడు వాహనాలను, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న మూడు వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బాల్‌రాజ్ గౌడ్, జగన్, సంతోశ్, భీమ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కారు బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

నవాబుపేట, మే 27: కారు బైక్ ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని కేశవపల్లి గేట్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్సై భరత్‌భూషణ్ తెలిపిన వివరాలు.. వికారాబాద్ నుంచి వస్తున్న బైక్‌ను నవాబుపేట నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. అదే సమయంలో అటువైపు ప్రయాణిస్తున్న పులుమామిడి మాజీ సర్పంచ్ భీంరెడ్డి తన సొంత వాహనంలో గాయపడిన బండ్ల అంతయ్యను వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై కారును వెంబడించి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని, వచ్చిన వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకొంటామని ఎస్సై భరత్‌భూషణ్ తెలిపారు.

### కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి సీపీ

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): ఘట్‌కేసర్‌లోని హోలి మేరి కాలేజీలో ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొత్రు సందర్శించారు. వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## మంత్రుల క్వార్టర్స్‌లో దొంగలు

### నిర్మాణ సామగ్రి తస్కరణ

బంజారాహిల్స్,మే 27: అత్యంత పటిష్టమైన భద్రత ఉండే మంత్రుల నివాసాల సముదాయాల్లో నిర్మాణ సామగ్రి చోరీకి గురైంది. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఇటీవల ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. పనులు పూర్తయిన తర్వాత కొంత స్టీల్, డోర్స్, కిటికీలు అక్కడే భద్రపర్చారు. అయితే, ఈ నెల 26న సైట్ వద్దకు వచ్చి చూడగా.. అక్కడ ఉంచిన నిర్మాణ సామగ్రి మాయమైంది. దీంతో అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆర్ అండ్ బీ శాఖలో ఏఈగా పనిచేస్తున్న కిషన్ సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీసీ 379 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు విచారణ చేపట్టారు. హై సెక్యూరిటీ జోన్‌గా పరిగణించే మంత్రుల నివాస ప్రాంగణంలో నిర్మాణ సామగ్రి చోరీ అయిన విషయం బయటకు పొక్కితే పరువు పోతుందని భావించిన పోలీసులు రహస్యంగా విచారణ చేస్తున్నారు.

### రెండు పబ్స్‌పై కేసులు

బంజారాహిల్స్,మే 27: రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా కార్లను పార్క్ చేయిస్తున్న రెండు పబ్స్ నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని జెనా పబ్, 36 డౌన్‌టౌన్ పబ్స్ వద్ద సరైన పార్కింగ్ సదుపాయాన్ని కల్పించకపోవడంతో అక్కడికి వచ్చే కస్టమర్లు తమ కార్లను రోడ్ల పక్కనే పార్క్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్తున్న ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ కె.నర్సింహారావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. రెండు పబ్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సీనియర్ జర్నలిస్టు మృతి

పెద్దేముల్, మే 27 : మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నర్సింహారెడ్డి అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం గాజీపూర్‌లో అంత్యక్రియలు జరిగాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి స్థానిక తహసీల్దార్ కిషన్, ఆర్ఐ రాజురెడ్డిల ద్వారా ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే ఆర్బీవోఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ ప్రతినిధులు పలువురు నర్సింహా రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందించి ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసాను కల్పించారు.

पंजाब नैशनल बैंक ...भरोसे का प्रतीक ! | పంజాబ్ నేషనల్ బ్యాంక్ ... విశ్వాసానికి ప్రతీక!
సర్కిల్ ఆఫీస్, GAD డిపార్ట్‌మెంట్, రీజెన్సీ ప్లాజా, (1వ అంతస్తు), ప్లాట్ నం.3, ఇం.నం. 7-1-450/RP/3/1/A, మైత్రివిహార్ ఏరియా, అమీర్‌పేట్, హైదరాబాద్- 500016. E-MAIL- cohydgad@pnb.co.in
కార్యాలయం కొరకు ఆవరణ కావలెను
పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారికి శంకర్‌పల్లి, రంగారెడ్డి జిల్లా నందు సిద్ధంగా ఉన్న చక్కగా నిర్మించిన ఆవరణ బ్యాంక్ మరియు ఎటియం కొరకు మొత్తంగా (1400 చ॥అ॥ నుండి 1600 చ॥అ॥ల వరకు) కార్పెట్ ఏరియా కలిగిన ఉన్న భవనము లీజు/అద్దె ప్రాతిపదికన కావలెను. ప్రాంగణము గ్రౌండ్ ఫ్లోర్ గల భవనమునకు ప్రాధాన్యత కలదు మరియు ప్రాంగణం మొదటి అంతస్తులో ఉన్న యెడల లిఫ్ట్ సౌకర్యం తప్పనిసరిగా ఉండవలెను.
ఆఫర్ చేసిన ఆవరణకు చట్టబద్ధమైన అధికారుల నుండి అన్ని క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఉండవలెను. ఆసక్తి గల స్థల యజమానులు/సమోదిత పవర్ ఆఫ్ అటార్నీ కలవారు తక్షణమే అందుబాటులో ఉన్న ప్రాంగణాలను దీర్ఘకాలికంగా లీజుకు ఇవ్వడానికి సిద్ధంగా ఉండి లీజు ప్రాంగణంను 15 సంవత్సరాల పాటు ఇవ్వడానికి వారి ఆఫర్లను సూచించిన నాటికి పంపవచ్చును. అవసరమైన ఫార్మేటులను బ్యాంక్ వెబ్‌సైట్ www.pnbindia.in నందు లేదా కార్యాలయ పని వేళల్లో పై చిరునామా నుండి పొందగలరు. పూర్తి ఆఫర్‌ను సక్రమంగా సీలు మరియు సంతకం చేసి 10.06.2024 సా॥ 3.00 గంటల సమయం లోపు పైన తెలుపబడిన చిరునామాకి పంపగలరు. బ్యాంక్ ద్వారా ఎటువంటి బ్రోకరేజీ చెల్లించబడదు. బ్యాంక్ అభీష్టం మేరకు ఏదైనా లేదా అన్ని ఆఫర్లను ఎటువంటి కారణాలు తెలియజేయకుండా అంగీకరించే/తిరస్కరించే హక్కుకలదు.
తేది: 28.05.2024, ప్రదేశం: హైదరాబాద్ | సం/- సర్కిల్ హెడ్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962